# హుండీ భద్రం

-అయ్యగారి శ్రీనివాసరావు

"థాంక్సండీ" న్యూట్రల్‌లో బండి ఆపిన భద్రంతో అన్నాడు వెనకనించి దిగిన వ్యక్తి.

ఆ మాట విన్న భద్రం "దీంట్లో థాంక్స్‌దేముందిలెండి గాని, ఓ ఎనిమిది రూపాయలివ్వండి చాలు" అన్నాడు.

ఆ మాటకి అవతలవ్యక్తి గతుక్కుమన్నాడు. భద్రం ఏమంటున్నాడో ఒక్క క్షణం అర్థంకాలేదతడికి. ఆ తర్వాత ఎంత ఆలోచించినా ప్రయోజనం కనబడలేదు. ఎందుకీ బాధని అతడ్నే అడిగాడు "ఎనిమిది రూపాయలెందుకండీ..?" అని బేలగా మొహం పెట్టి.

ఆమాటకి భద్రం "మిమ్మల్ని పాతిక కిలోమీటర్లు బండి మీద తీసుకొచ్చాను కదా. మరి దేనికనడుగుతారేంటి? బస్సెక్కితే ఇస్తారా? ఇవ్వరా?" అన్నాడు కారంపొడి ఆడుతున్న మిల్లు డ్రైవర్‌లా ముఖం పెట్టి.

"లిఫ్టుకీ..డబ్బులా?" నసుగుతూ నంగిగా అన్నాడా వ్యక్తి.

"ఏం? లిఫ్టయితే డబ్బు తీసుకోకూడదని ఎక్కడైనా రాసుందా? అద్సరేగాని బస్సయితే ఆర్డినరీ బస్సే పదిరూపాయలు తీసుకుంటాడు. నేను ఎక్స్‌ప్రెస్‌లా ఎక్కడా ఆపకుండా తెచ్చాను. అయినా ఎక్స్‌ప్రెస్ ఛార్జీ అడిగేనేంటి? పాసింజర్ ఛార్జీలోనే రెండ్రూపాయలు తగ్గించి అడిగాను. మీకించుమించు అయిదు రూపాయలు లాభం. అవునా కాదా? నాకవతల చాలా పన్లు ఉన్నాయి త్వరగా ఇవ్వండి" అన్నాడు తొందరచేస్తూ.

దాంతో బయలుదేరుతున్న రైల్లోంచి ఒక చెప్పు జారిపోయిన వ్యక్తిలా బిక్కమొహం పెట్టి పదిరూపాయలనోటు తీసి అతడికందించాడతను. ఆ నోటందుకున్న భద్రం జేబులోంచి చిల్లర తడిమి అతడికున్న పరిజ్ఞానంతో రూపాయి బిళ్ళ తీసి "ఈ రూపాయే ఉంది జేబులో. ఈసారి కనబడినప్పుడిస్తాన్లెండి" అంటూ బయలుదేరాడు గేరు మార్చి.

అలా వెళ్ళిపోతున్న భద్రాన్ని కనుచూపుమేర వరకూ కన్నార్పకుండా అలాగే చూస్తూండిపోయాడు పీడకల వస్తే తెలివొచ్చాక నిద్రపట్టని వ్యక్తిలా.

అలా వెళ్ళిన భద్రం తిన్నగా తను పనిచేస్తున్న స్కూల్‌కెళ్లాడు. అతడికోసమే ఎదురుచూస్తున్న అతడి కొలీగ్ ఎదురెళ్ళి "ఏం సార్! కాయా?పండా?" అడిగాడు ఇంకా భద్రం బండి మీదనుంచి దిగకుండానే.

"మామూలు పండుకాదు కలవల పండు" అన్నాడు ఇందాకటి వ్యక్తిలాగా. అంతకుముందు కూడా డబ్బులిచ్చి బండెక్కిన పాసింజర్ని తలచుకుని. ఆ విషయం తెలియని అమాయక పక్షి అయిన ఆ కొలీగ్ మాత్రం తన పని పూర్తి చేసినందుకు సంతోషించి "థాంక్సండి" అన్నాడు.

"అద్సరేగానీ ఇందాక పెట్రోల్ కోసం మీరిచ్చిన డబ్బుల్లో లీటర్ ఆయిల్ ఖరీదు పోగా మిగిలిన చిల్లర ఇదిగో" అంటూ చిల్లరందించబోయాడు.

అదందుకోకుండానే "భలేవారు సార్! నాకింత ఉపకారం చేశారు ఇంకా చిల్లరిస్తానంటారేంటి సార్!" అన్నాడు.

ఆమాట విన్న భద్రం చిల్లరిచ్చే కార్యక్రమాన్ని విరమించుకుని 'ఇదో పన్నెండు రూపాయలు లాభం' అని మనసులో అనుకుని ఆ డబ్బుల్ని జేబులో వేసుకున్నాడు.

అసలు జరిగిందేమిటంటే భద్రం దూరపు బంధువుల పిల్లాడు తల్లిదండ్రుల అత్యాశకు బలైన ముదర పెళ్ళికొడుకు ఉన్నాడు. మగపిల్లాడుకదాని ఎవరికోసం ఇస్తారని అత్యాశకు పోయి పెద్దమొత్తంలో కట్నాలు అడగడం మొదలుపెట్టారు. ఆ మొత్తం విని జడుసుకున్న ఆడపిల్ల తల్లిదండ్రులు పిల్లనిస్తామని అడగడమే మానేశారు. అలా ముదిరిపోయిన పిల్లాడికి మీ పిల్లనిస్తారా? మీ పిల్లనిస్తారా అని పెళ్లికూతుర్ని వెతకడం మొదలెట్టారు వాళ్ళ తల్లిదండ్రులు.

అలాంటి సమయంలో మన భద్రం కొలీగ్ కూతురికి కూడా సంబంధాలు దొరక్క బాధపడుతున్నారామె తల్లిదండ్రులు. ఆమెకూడా సినిమాలు చూసీ, చూసీ అదే జీవితం అనుకుని ఏవేవో ఊహించేసుకుని తల్లిదండ్రులు తేగలిగిన అలాటిలాటి సంబంధాలు కాదని పెళ్లికాకుండా ముదిరిపోయింది. అప్పటికి వాస్తవ పరిస్థితులు తెలుసుకుని పెళ్ళికొప్పుకుంది.

ఎప్పుడంటే అప్పుడు ఎక్కడంటే అక్కడ దొరకడానికి ఏమైనా సారా ప్యాకెట్లా? బ్రాందీ సీసాలా? పెళ్లికొడుకులు. అదిగో అలాంటప్పుడు పడ్డారా ఇరువురి తల్లిదండ్రులూ భద్రం చేతిలో.

తత్వం తలకెక్కిన ఇరుపక్షాలవారూ తమ పిల్లలకి పెళ్ళి కావడమే పరమావధిగా తలంచారు. వారిద్దరికీ మధ్యవర్తి భద్రమే కావడంతో అతడేం చెప్పినా కాదనకుండా స్వామి ముందరి భక్తుల్లా నోరెత్తకుండా ఆచరిస్తున్నారు. అలాగ వారిద్దరి మధ్య ఖర్చులకని, కిలామత్తులకని, ఛార్జీలకనీ, అవనీ, ఇవనీ డబ్బు రాబడుతూ వాళ్లిచ్చిన డబ్బుకి తనకు తోచిన లెక్కలు చెబుతూ నిజాయితీపరుడనిపించుకుంటున్నాడు.

డ్యూటీ అయ్యాక ఇంటికెళ్ళిన భద్రం తనజేబులోంచి ఈరోజు సంపాదన బైటకి తీసి లెక్కపెట్టాడు. లిఫ్ట్ పేరుతో ఫేర్ చెల్లించిన ఇద్దరిచ్చినదీ, పెట్రోల్ పోయించగా మిగిలినదీ, పెట్రోల్ బంక్ దగ్గర చిల్లరలేదని మిగిల్చిన రూపాయి, పై ఊర్లో ఫ్రెండ్ కన్పించితే టీ ఇప్పించాడు అక్కడ చిల్లర మాత్రం తనచేతికిచ్చాడు కొట్టువాడు. ఆ చిల్లర ఇలా ఈరోజు మిగులు సొమ్మంతా హుండీలో వేశాడు.

అది హుండీ అంటే పిడత హుండీ అనుకునేరు. ఒక పెద్ద స్టీల్ డబ్బాకి సీలు వేయించి డబ్బులు పట్టే కన్నం మాత్రం ఉంచిన భద్రం బ్రాండ్ అతి భద్రమైన హుండీ. అంత హుండీ ఎందుకని అనుకోకండి. సావధానంగా చిత్తగిస్తే ఆ తత్వం మీకు తలకెక్కుతుంది.

చిల్లర హుండీలో వేసినతడికి అది నిండిపోయిన సూచనగా నాణాలు బైటకి కనబడసాగాయి.

'ఈ డబ్బుకి ఏ క్లయింట్ దొరుకుతాడా'అని ఆలోచనల్లో పడ్డాడు. అతడి ఆలోచనల్ని భగ్నం చేస్తూ "సార్!" అన్న పిలుపు బైట్నించి వినబడింది. అది తమ స్కూల్ అటెండర్ సింహాచలం దని గుర్తించి బైటికొచ్చాడు.

అతడ్ని చూడగానే వినయంగా నమస్కరించాడు అటెండర్.

"ఏంటోయ్ సింహాచలం! ఏంటి సంగతి ఇలా వచ్చావ్" అన్నాడు కాస్త వెటకారం నిండిన స్వరంతో.

"మాయమ్మాయి నీళ్లాడిదండీ" అన్నాడు బుర్రగోక్కుంటూ.


ఆ మాట విన్న భద్రం "చూడు సింహాచలం! ఆమాట చెప్పడానికి ఇంత దూరం రావాలా? ఐనా ఆడవాళ్ళు పేకాడితోనో, రేసులాడితేనో బాధపడాలి గానీ నీళ్లాడితే అంత బాధెందుకోయ్" ఏమీ తెలియనివాడిలా ముఖం పెట్టి అన్నాడు భద్రం.

ఆ మాటకి సింహాచలం "పల్లకోండి సార్. హాస్యాలాడడానికి నానే దొరికినానా?" అని వెర్రిన వ్వొకటి ఆ మాటలకి జోడించి "అమ్మిని డాక్టీరుకి సూపించాల ఓ వెయ్యి రూపాయలుంటే.." మాట పూర్తి చెయ్యకుండా బుర్రగోక్కుంటూ చివరిమాటలు సాగదీశాడు.

అతడు నమ్మకస్తుడే. ఆ విషయం భద్రానికి తెలుసు. కానీ అప్పనేసరికి అడగ్గానే ఇస్తే విలువ ఉండదనే వడ్డీ వ్యాపారలక్షణంతో "నేనే ఇబ్బందుల్లో ఉన్నాను" అంటూ మొదలెట్టి ఏవేవో ఖర్చులు, బాధలూ ఇబ్బందులూ కల్పించి నమ్మకం కలిగేటట్టు వర్ణించాడు.

అలా చెబుతున్నాడే గాని ఆ మాట విని అతడెక్కడ మనసు మార్చుకుంటాడోనని భయం మాత్రం కొబ్బరికోరాంలా మనసుని పీకుతోంది.

అప్పు ఇచ్చినవాడికెన్ని తెలివితేటలు ఉంటాయో తీసుకున్నవాడికి అంతకంటే ఎక్కువే ఉంటాయి కదా! అందుకే సింహాచలం కిందపెట్టి, మీదపెట్టి బ్రతిమాలి భద్రాన్ని ఒప్పించగల్గాడు. అలా ఒప్పుకున్న భద్రం మదిలో అతని నిండిన హుండీ మెదిలింది. భద్రం వడ్డీలకి అప్పు ఇచ్చినా ఎప్పుడూ నష్టపోలేదు. చెడ్డపేరు తెచ్చుకోలేదు. ఎందుకంటే తను హుండీలో కూడబెట్టిన డబ్బుని



అందరూ ఇచ్చే వడ్డీకన్నా పావలా తక్కువకే ఇస్తాడు. ఎందుకంటే తీర్చేవాడికి కష్టం కాబట్టి ఎగ్గొట్టే ప్రయత్నాలు చెయ్యొద్దని అతడి భావన. చిన్నమొత్తం అయితే అడిగిన వెంటనే తీర్చేస్తారు.

అసల్నతడు ఆరునెలలు దాటి అవతలి వాళ్ళ దగ్గరుంచడు. దానిమీద వచ్చే వడ్డీని భద్రంగా హుండీలోనే వేస్తాడు గాని ప్రాణం పోయినా అందులోంచి పైసా కూడా వాడడు.

అలాంటి భద్రం ఆలోచనల్లో ఉండగానే గదిలో కాగితాల చప్పుడు వినబడి అతడి మనసేదో కీడు శంకించింది. అతడి భయం నిజమే. అందుకే కర్తవ్యం గుర్తొచ్చి "అవునే సుందరం నీకెన్నిసార్లు చెప్పానే న్యూస్‌పేపర్లని అలా అల్మరాలకు వెయ్యడానికి వాడొద్దని" అన్నాడు భార్యనుద్దేశించి. అప్పటికీ భార్య ఎంత బతిమాలినా ఆమె ప్రయత్నాన్ని సాగనివ్వలేదు.

దానికామె మొగుడు పిసినిగొట్టుతనాన్ని కసిదీరా మనసులోనే తిట్టుకుంది 'అక్కడికేదో కష్టపడి పూర్తి డబ్బులిచ్చి కొన్న పేపర్లలా గింజుకుపోతున్నారు' అనుకుంది. ఆమె అలా తిట్టుకోడానికి కారణం లేకపోలేదు. స్కూల్‌కి తెప్పించిన పేపర్లని అందరూ చదివేశాక సగం రేటుకి సాయంకాలం ఇంటికి తెచ్చేస్తాడు. ఆ ఆలోచన అతడే చెప్పడంతో వాళ్లకీ లాభమే కాబట్టి వాళ్ళూ ఒప్పుకున్నారు.

అలా తెచ్చిన పేపర్లని ఆరునెలల తర్వాత అమ్మేస్తాడు. బియ్యం గోనెల దగ్గర్నుంచి, చిత్తుకాగితాల వరకూ దేన్నీ వృథా కానివ్వకుండా జాగ్రత్తగా దాచ్చి అమ్ముతాడు. అలా వచ్చిన వన్నీ హుండీ పాలే.

టూత్‌పేస్ట్ ట్యూబ్ మూతలు, ఖాళీ పేపర్ డబ్బాలు, చిన్నచిన్న ఖాళీ ప్లాస్టిక్ డబ్బాలు, విరిగిపోయిన మగ్‌లు, పాతచెప్పులు (అరిగిపోతే అమ్ముకోవచ్చని ప్లాస్టిక్ చెప్పులే కొంటాడెప్పుడూ) చిన్న చిన్న ఇనపముక్కలు...ఇలా ఏదీ వృథా చెయ్యకుండా ఒక బుట్టలో పెట్టి అది నిండాక పాత ఇనప సామాన్ల వాడికి కేజీల లెక్కన అమ్మి ఆడబ్బుల్నీ హుండీలోనే వేస్తాడు.

భద్రం గురించి ఆమె కంతుబట్టని విషయం ఒకటుంది. 'పెద్ద మొత్తాల జోలికి పోకుండా ఇలా చిల్లర పనులవల్ల ఇతడెంత సంపాదిస్తాడు?' అనుకుంటుంది.

ఆమెకింకా ఆశ్చర్యమే భర్త చేసిన ఒక పని. అవసరమైనా, కాకపోయినా ఆ సంఘటన మదిలో మెదులుతూనే ఉంటుంది. అలాగే ఇప్పుడూను.

* * *

ఆ మధ్య ఒకసారి అతడు వీధిలోంచి వస్తూంటే అతడి వెనకాల రెండు గొర్రెపిల్లల్ని వెంటబెట్టుకుని వచ్చాడో ఆసామి. వాటిని చూసిన సుందరమ్మ "ఆ గొర్రెపిల్లల్ని ఎందుకు వెంటబెట్టుకొచ్చారూ? మీకేమైనా మతిపోయిందా?" అంది చిరాగ్గా మొహం పెట్టి.

ఆమె మాట పట్టించుకోకుండా ఇంట్లోకెళ్ళి వెయ్యిరూపాయలు తెచ్చి ఆ ఆసామికిచ్చి "అతగాడ్ని తొందరగా రమ్మను" అన్నాడతడితో. "అలాగే" అంటూ తలూపి అతడెళ్లిపోయాడు.

అప్పుడు విరుచుకుపడింది సుందరం భర్తమీద. "ఈ దరిద్రగొట్టు గొర్రెపిల్లల్నెందుకండీ నెత్తికెక్కించుకుంటున్నారు ఛండాలంగా" అంది జుగుప్సగా మొహం పెట్టి.

ఆమాటకి భద్రం శాంతంగానే "చూడు సుందరం! లక్ష్మీ స్వరూపాన్ని పట్టుకుని దరిద్రం అనకు. తప్పు. ఈ గొర్రెపిల్లలు మరోగంట తర్వాత మనింట్లో ఉండవ్. మేపుకని మరో వ్యక్తి తీసికెళ్ళిపోతాడు. సంవత్సరం పాటు మేపి అట్నుంచటే వాటిని అమ్మేస్తాడు. మూడువేలొస్తాయి. అతడికి మేపినందుకు వెయ్యిరూపాయలు తీసుకుని రెండువేలూ మనకిస్తాడు. సంవత్సరంలో రెట్టింపు మొత్తం ఏ బ్యాంకిస్తుంది చెప్పు' అన్నాడు.

ఆ మాట విన్న సుందరం "బాగుంది వరస! ఆ గొర్రెపిల్లల్ని మీకు చెప్పకుండా వాడే అమ్మేసుకుని మీకు సున్నా చుట్టేస్తే..?" అంది.

"చూడు సుందరం! ఎంత బుద్ధి తక్కువవాడైనా వాడు తినే కూడులో వాడే బుగ్గి పోసుకోడు. ఎందుకంటే వాడి జీవనాధారమే అది" అన్నాడు.

అతడన్నట్టుగానే సంవత్సరం తర్వాత రెండువేలూ వచ్చాయి. ఒక వెయ్యి రూపాయలు హుండీలో వేసి మిగిలిన వెయ్యితో మరి రెండు గొర్రెపిల్లల్ని కొని అదే పని చేశాడు. అది చూసిన భార్య సుందరం "ఆ రెండువేలూ పెట్టి నాలుగు గొర్రెపిల్లల్ని కొనవచ్చు కదా?" అంది.

"చెరుకు తియ్యగా ఉంది కదాని వేరువరకూ తింటే ఇసక పళ్ళుకింద పడి ఇదివరకు అనుభవించిన తీపి కూడా మర్చిపోవలసి వస్తుంది" అన్నాడు. ఆమాట విన్న సుందరం కిక్కురుమనలేకపోయింది.

అసలు భర్త అంత కాలిక్యులేటెడ్‌గా ఎలా ఉంటాడో అర్థంకాలేదెంత ఆలోచించినా ఆమెకి.

ఎప్పుడైనా ప్రయాణంలో స్నేహితులెవ్వరైనా అతడికి టికెట్ కొంటే ఇంటికొ



## ప్రశంసలు

ఇటీవల వచ్చిన 'బ్లాక్' చిత్రంలో తన నటనకు వచ్చిన ప్రశంసలకి రాణీ ముఖర్జీ తెగ సంబరపడిపోతోంది. ఇలాంటి పాత్ర లభించడం నిజంగా నా అదృష్టం అని చెప్పుకుంటున్న రాణీ ముఖర్జీ- తన ఫ్రెండ్ షారుఖ్ ఖాన్ తీయబోయే 'ఘోస్ట్ కా దోస్త్' సినిమాలో నటించడానికి ఒప్పుకుందిట. ఇందులో అమితాబ్ కూడా ముఖ్యపాత్ర పోషిస్తున్నాడు. ఏదేమైనా పాత్రల ఎన్నికలో చాలా చూజీగా వుంటున్నాను- అని సగర్వంగా చెబుతోంది రాణీ.



చ్చాక ఆ టికెట్ ఖరీదుని మరో ఖర్చు చేయకుండా హుండీలో వేస్తాడు. ఏమైనా అంటే "నేను టికెట్ తీస్తే అది ఖర్చయేదే కదా? అలాగే ఖర్చయిందను కుని హుండీలో వేస్తున్నాను'' అంటాడు. నెల ఖర్చులకని ఉంచిన డబ్బుల్లో మరుసటినెలలో జీతం అందేనాటికి రూపాయి మిగిలినా హుండీలోనే వేస్తాడు. ఏమైనా అంటే ఆ బడ్జెట్ నిన్నటితో సరి అంటాడు. ఇంక్రిమెంట్ ఎరియర్స్‌గానీ, డిఏ ఏరియర్స్ గానీ వస్తే అవీ హుండీ పాలబడవలసిందే. ఏమైనా అంటే "అది పై నెల నుంచీ జీతంలో కలుస్తుంది. ఈనెలకిది పై రాబడి కిందే లెక్క'' అంటాడు.

అది కొంతవరకూ నయమే. కానీ బస్సెక్కితే టైరు మీదున్న సీటు వెనక సీటులోనే కూర్చుందామంటాడు. "ఎత్తి కుదేస్తుందండీ'' అంటే వినడు. ఆ సీటునే ఎందుకు ప్రిఫర్ చేస్తాడో ఒకసారి ప్రత్యక్షంగా అనుభవం అయిందా మెకు. ఆ టైరుమీద కూర్చున్నవాళ్ళు కాళ్ళు పైకెత్తి పెట్టుకుని కూర్చోవడంతో వాళ్ళ జేబుల్లో ఉన్న చిల్లర డబ్బులు వెనక్కి పడ్డాయి. క్రిందపడి చప్పుడకాక ముందే చేయడ్డుపెట్టి వాటిని అందుకుని ఇంటికొచ్చాక ఆ డబ్బుల్ని హుండీలో వేస్తాడు. సినిమాకెళ్లినా ఆఖరు రోజుల్లోనే వెళతాడు. అప్పుడైతే అందరూ చూసేస్తారు కాబట్టి సెకెండ్‌క్లాస్‌కెళ్లినా ఎవరికీ తెలియదని. ఆర కంగా ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టే అవసరం ఉండదని అంటాడు.

కూరలు కొన్నా సాయంకాలమే గానీ ప్రాణం పోయినా ఉదయం కొనడు.

★ ★ ★

"సుందరం! మన గోపాలరావు మాస్టారిల్లు అమ్మేస్తారంటున్నారు కదా ఎంత చెబుతున్నారంటావ్?'' అడిగాడు ఒకనాటి ఉదయాన్నే కాఫీ తాగుతున్న వేళ.

"ఐదులక్షలు చెప్తున్నారు. ఏం కొంటారేంటి? మీతాతగారు సంపాదించిన ముల్లె ఏదో చెల్లుబాటు కావడంలేదు కాబోలు'' అంది వ్యంగ్యంగా భర్త పిసినా రితనంతో విసిగిపోయినామె. ఆరోజు పని ఇంకా తెమలకపోవడంతో విసుగ్గా ఉంది. అదీ ఇదీ కలిపి ఆమె నోటంట ఆ విసురలా వచ్చింది.

"ఏమైనా తగ్గుతారంటావా?''చెదరని గంభీరంతో అన్నాడు.

ఆమాటలోని గంభీరతని చూసి వ్యంగ్యంగా మాట్లాడే సాహసం చేయ లేదు. కాకపోతే పరాకుగా ఉన్నప్పుడు ఏదో వింత ఆకారాన్ని చూసి జడుసు కున్న చంటి పిల్లాడిలా ముఖం పెట్టి "ఏమో ఎవరడిగినా అయిదులక్షలకి తగ్గ నని చెప్పడంతో అడగడానికే జంకుతున్నారట'' అంది.

ఒక్క క్షణం నిశ్శబ్దం అనంతరం "సుందరం! ఆ ఇల్లు మూడులక్షలకిస్తాన న్నారు. కొందామనుకుంటున్నాను. బాగుంటుందంటావా?'' అడిగాడు. ఆ మాట విన్న ఆమె భర్త ఏమంటున్నాడో అర్థంకాని ఆమె చాలా రోజుల్నుంచి తెరవని తలుపులకున్న గడియలాగా బిగుసుకుపోయింది.

అన్ని సదుపాయాలూ ఉన్న ఆ ల్లుని తనేనాడూ ఊహించనైనా లేదు. అలాంటిది సొంతమవుతున్నదనే మాటే ఆమె అలా బిగుసుకుపోవడానికి కారణం.

"గోపాలరావు మాస్టారు కొడుకుల దగ్గరకి ఫారిన్ వెళ్లడానికి పాస్‌పోర్ట్ తీసుకున్నారు. దాని గడువు దాటి పోయే స్థితికొచ్చింది. మళ్ళీ ఇండియా వచ్చే ఉద్దేశ్యం లేని అతడు ఆ ఇంటిని ఎంతకో కొంతకి అమ్మేయాలని తొంద రపడుతున్నట్లు అతడి మాటలవల్లే కనిపెట్టాడు. లక్షలకి లక్షలు మూల్గుతున్న అతడికి ఆ ఇంటిమీద వచ్చే డబ్బు ఒక లెక్క కాదని తెలుసునాకు. అందుకే ఇ ల్లు నాకమ్మేస్తే మీ పేరు చెప్పుకుని నేనుంటానని, అదీ కాక నాలుగురోజుల్లో పూర్తి డబ్బిచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటానని అదనీ, ఇదనీ చెప్పాను. దాని కతడు మెత్తబడి నేనడిగిన మొత్తానికి ఒప్పుకున్నాడు. ఎల్లుండి ఏకాదశి, శుక్ర వారం రిజిస్ట్రేషన్'' అన్నాడు.

విజయవాడ వస్తే వడదెబ్బకి సొమ్మసిల్లిన కాశ్మీర నివాసి క్రమక్రమంగా ఈ వాతావరణానికి అలవాటు పడి తేరుకున్నట్లు ఆమె తేరుకుంది. పెగలని నోరుని బలవంతంగా సవరించుకుని "ఏమండీ! మీరు చెబుతున్నదీ...'' అంటూ అర్థో క్తిగా ఆగిపోయింది. "నిజమేనా..'' అనడిగే సాహసం చెయ్యలేక.

"అంత డబ్బు...'' అని ఇంకేదో అనబోయి భర్త టాలెంట్ తెల్సింది కాబట్టి ఆగింది.

భార్య అడగకపోయినా చెప్పే బాధ్యత తనకుంది కాబట్టి "అంతా ఆ హుండీ మహాత్మ్యం. నీకు తెలిసినవే కాకుండా ఇంకా ఎన్నో రకాల పొదుపు చర్యలతో దాన్ని నింపాను. ఆ హుండీ మాత దయవల్ల ఇంటి ఖరీదుకి ఉన్నది. ఇక పై ఖర్చుల కంటావా ఇద్దరు ముగ్గుర్నడిగాను. వాళ్ళు మాటతో బాటు డబ్బు కూడా ఇచ్చేశారు. ఇంక శుక్రవారం రావడమే ఆలస్యం. వాళ్ళ బాకీ సంగతంటావా? ఆ హుండీ మాతే ఉందన్నిటికీ'' అన్నాడు తన్మయ త్వంతో కళ్ళు మూసుకుని శూన్యంలోకి నమస్కారం చేస్తూ.

★

## విరుగుడు మంత్రం

గోడలమీద పాన్ ఉమ్ములు వేయడం సర్వసాధారణంగా దేశంలో అన్ని నగరాల్లోనూ జరిగేదే. అయితే ఒరిస్సాలోని వర్క్స్ సెక్రటరీ ఎన్.ఎన్.దాస్ దీనికో విరుగుడు మంత్రం కనిపెట్టాడు. నగరాల్లో పబ్లిక్ ప్లేసె స్‌లోని గోడలమీద, గవర్నమెంటు బిల్డింగ్స్ గోడలమీద చక్కగా పెయిం టింగ్ చేయించి వాటిమీద దేవతామూర్తులను చిత్రింపజేసాడు. అంతే! దైవ భీతిగల ఒరిస్సావాసులు ఒళ్ళు దగ్గర పెట్టుకుని గోడలకి దూరంగా పోసా గారు. ఇప్పుడవి పరిశుభ్రంగా ఉంటున్నాయి. సర్కారువారి నోటీసులు చేయని పనిని దేవతా చిత్రాలు చేసి చూపించాయి.

## యువరాజుగారి దుబారా!

యువరాజు ఛార్లెస్‌ని ఎలిజబెత్ రాణి ఆమధ్య మందలించిరిదట. ఎందుకో తెలుసా? ఆయన దుబారా ఖర్చులకి. రాజమహల్‌లో ఆయన సేవలకోసం 85మంది సేవకులున్నారట. వాళ్ళు చేసే సేవలలో నిత్యం జరిగేది- ఆయన విలాసంగా గదుల్లో విసిరేసే ఖరీదైన సూట్లని రోజుకు నాలుగైదుసార్లయినా తీసి జాగ్రత్త చేయడం, ఆయన టూత్‌బ్రెష్‌మీద అతు క్కుపోయిన టూత్‌పేస్ట్‌ని గీరి పెట్టడం! ఇలా చెప్పుకుంటూ పోతే చాలా వుంటాయి. గార్డియన్ పేపర్లో వచ్చిన ఈ వార్త చదివిన బ్రిటిష్ నాగరికులు తమ యువరాజు ఇంత అనాగరికుడా అని ఆశ్చర్యపోతున్నారు!

-విమలారామం

